# కీర్తికాంక్ష

"సార్! మిమ్మల్ని మేనేజర్ గారు పిలుస్తున్నారు" అన్న అటెండర్ చలమయ్య పిలుపుతో, అరగంట క్రితం వచ్చిన టెలిగ్రాంని ఆరోసారి చదువుతున్న సుబ్బారావు ఉలిక్కిపడి, ఆ టెలిగ్రామ్ ని మడిచి, జేబులో పెట్టుకుని లేచి మేనేజర్ గారి రూమ్‌లోకి బయలుదేరాడు అదిరే గుండెల్ని అదుపులో పెట్టుకుని. "ఏమిటయ్యా! ఏదో టెలిగ్రాం వచ్చిందట" సుబ్బారావుని చూస్తూనే డైరెక్టుగా పాయింట్‌లోకి వచ్చేశాడు మేనేజర్ కొండల రాయుడు. మేనేజర్ నోట ఆ ప్రశ్న వినగానే ఉబ్బి తబ్బిబ్బు అయ్యాడు సుబ్బారావు. "నా కథకి ఫస్టు ప్రయిజ్ వచ్చిందట సార్! ఫోటో, వివరాలూ పంపమని వ్రాసారు 'ఆంధ్ర దీపం' పత్రికవారు. ఇన్నాళ్ళకి నా కృషి ఫలించి నా కథకి బహుమతి వచ్చింది సార్!" ఆనందంగా అన్నాడు సుబ్బారావు. "అయితే ఇన్నాళ్ళూ సాహితీవనంలో వానపాములా వుండే నువ్వు ఇప్పుడు త్రాచుపాములా మారావన్నమాట. అందుకో నా అభినందనలు. కానీ నాది ఒక చిన్న రిక్వెస్టోయి." అన్నాడు కొండల రాయుడు. అతని ఉపమానానికి చిరాకు పడుతూ "ఏంటిసార్?" అని అడిగాడు.

"నీ ఫోటో, నీ వివరాలకి బదులు నా ఫోటో, నా వివరాలూ పంపు. దట్సాల్" అన్నాడు కొండలరాయుడు.

"అదెలా సాధ్యం సార్?" అయోమయంగా అడిగాడు సుబ్బారావు.

"ఎలా ఏం వుందోయ్! కొండలరాయుడినైన నేను సుబ్బారావు అనే కలంపేరుతో రచనలు చేస్తున్నాను. అని నా వివరాలూ, ఫోటో పంపు. రచన అడుగున వున్న సంతకాన్ని ఎవరూ పట్టించుకోరులే. రాలిపోబోయే పండుటాకు లాంటి వాడిని. నా మాట కాదనకు. ఎన్ని రోజుల నుంచో, సారీ ఎన్ని సంవత్సరాల నుంచో నా ఫోటో అచ్చులో చూసుకోవాలని నా కోరిక. కాదనకు ఈ ఒక్కసారికే. తరువాత నుంచీ నీవి నువ్వే పంపుకుందు గాని. భవిష్యత్తులో ఎన్నో బహుమతులు వస్తాయి. కాదనకు" అన్నాడు కొండలరాయుడు.




మేనేజర్ మాటని తిరస్కరించలేక, తిరస్కరించి కష్టాలు కొని తెచ్చుకోలేక ఒప్పుకొన్నాడు సుబ్బారావు. కొండలరాయుడి దగ్గర నుంచి వివరాలూ, ఫోటో తీసుకొని వాటిని 'ఆంధ్ర దీపం' వారపత్రికకి పంపించాడు. నెల తిరిగేసరికి ఆ వివరాలు ప్రచురించబడి వున్న 'ఆంధ్ర దీపం' వారపత్రిక మార్కెట్‌లోకి వచ్చింది.

ఆ మరుసటి రోజే కొండల రాయుడికి సెక్షన్ ఆఫీసర్ నుంచి పిలుపు వచ్చింది. 'ఏం కొంప మునిగిందిరా భగవంతుడా' అని అనుకొంటూ ఆయన రూమ్‌లోకి నడిచాడు కొండల రాయుడు. 'మీరు కథలు రాస్తారా?" డైరెక్టుగా పాయింట్‌లోకి వచ్చేశాడు సెక్షన్ ఆఫీసర్ వెంకటప్పయ్య. "ఆ! ఏదో, అప్పుడప్పుడూ సార్!" సిగ్గు పడుతూ చెప్పాడు మేనేజర్ కొండల రాయుడు. "నిన్న మార్కెట్‌లో 'ఆంధ్ర దీపం' వారపత్రికలో మీ ఫోటో చూసి స్టన్ అయి పోయాను. నాకు కాస్త ముందు చెప్పవలసింది. నా ఫోటో, వివరాలూ మీకు ఇచ్చేవాడిని. మా ఆవిడకి రచయితలంటే మక్కువ ఎక్కువ. కథలు రాయమని నా ప్రాణాలు తీస్తూ వుంటుంది. ఈసారి మీకు ఏమైనా బహుమతులు వస్తే చెప్పండి. నా ఫోటో, వివరాలూ మీకు ఇస్తాను. మీ ప్రమోషన్ విషయం గుర్తుంది. ఈ విషయం తరువాత దాని సంగతి చూస్తాను" అన్నాడు వెంకటప్పయ్య. కొండల రాయుడి గొంతులో వచ్చి వెలక్కాయ పడినట్టు అయింది.

– కాశీభట్ల భానుమూర్తి